సాక్షి పెద్దపల్లి

శనివారం, 12, అక్టోబర్, 2024

విజయీభవ

- నేడు విజయదశమి
- షమీ పూజకు ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్(కరీంనగర్): సకల జగత్తుకు మూలం. త్రిమూర్తులకు శక్తిప్రదాత. త్రిలోకేశ్వరి దుర్గామాత.. దుష్ట శిక్షణ గావించిన రోజున విజయదశమి జరుపుకోవడం ఆనవాయితీ. విజయదశమి వేడుకల్లో భాగంగా శమీ వృక్షాన్ని పూజించడం, వాహన, పనిముట్లకు ఆయుధపూజలు చేయడం సంప్రదాయం. తెలంగాణ ప్రాంతంలో ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకునే అతిపెద్ద పండుగ దసరా. ఈ రోజు చేపట్టిన ప్రతీ పనిలో విజయం లభిస్తుందని నమ్మకం. దసరా రోజు సాయంత్రం పాలపిట్టను చూస్తే శుభం కలుగుతుందనే నమ్మకం ఉంది. నేటి దసరాకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు.



న్యూస్‌రీల్

ఎన్టీపీసీ ఒక మినీ భారత్



మొక్క నాటుతున్న ఆర్ఈడీ ప్రేమ్‌ప్రకాశ్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ మినీ భారత్ అని, దేశంలోని ప్రతీరాష్ట్రానికి చెందిన వ్యక్తులు విధులు నిర్వహిస్తుండటంతో సంస్థ ఉద్యోగుల ఆహ్లాదం కోసం ప్రత్యేక పండుగలు నిర్వహిస్తున్నామని ఎన్టీపీసీ సదరన్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రేమ్‌ప్రకాశ్ అన్నారు. పీటీఎస్‌లోని దుర్గాదేవీ సన్నిధిలో గురువారం రాత్రి ఆయన పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. శుక్రవారం ప్రాజెక్టులోని పలు విభాగాలను సందర్శించి అధికారులతో మాట్లాడారు. అనంతరం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండుతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దక్షిణ దీపాంజలి మహిళా సమితి అధ్యక్షురాలు మీను బాత్రా, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు చిన్మయి దాస్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు



పూజల్లో ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని చీకురాయి క్రాస్ రోడ్డు వద్ద దుర్గాదేవీ మండపంలోని దుర్గా మాత సన్నిధిలో ఎమ్మెల్యే విజయరమణారావు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాదేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిదులు, కాలనీవాసులు ఉన్నారు.

బ్యాలెట్ బాక్సుల మరమ్మతు



మరమ్మతులు పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులకు మరమ్మతు చేపట్టారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు గిడ్డంగుల్లో భద్రపర్చిన బ్యాలెట్ బాక్సులను ఎన్నికల నిర్వహణకు అనువుగా తయారు చేస్తున్నారు. వీటిని డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీవోలు సుదర్శన్, అనిల్‌రెడ్డి పరిశీలించారు.

లేజర్ షో.. ఫుడ్‌కోర్టు



సింగరేణి క్రీడామైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, జీఎం లలిత్‌కుమార్, పోలీసు అధికారులు, నాయకులు

- అతిథులకు తెలంగాణ రుచులు
- అదిరేలా కళాకారుల ఆటాపాటలు
- అంబరాన్నంటేలా విజయదశకి ఉత్సవాలు
- సింగరేణి, రామగుండం బల్దియా, ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ క్రీడామైదానం వేదిక
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్
- నేడు దసరా వేడుకలు

గోదావరిఖని: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కోల్‌బెల్ట్ ప్రాంతంలో శనివారం దసరా వేడుకలు నిర్వహించాలని సింగరేణి యాజమాన్యంతోపాటు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో ఇటీవల సమీక్ష నిర్వహించిన రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్.. గతం కన్నా భిన్నంగా.. ఘనంగా సింగరేణి రాంలీలాకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే సింగరేణి, బల్దియా, పోలీసు, ఎన్టీపీసీ అధికారులు సంయుక్తంగా దసరా వేడుకలను విజయవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సింగరేణి యాజమాన్యం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అన్నిఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం మైదానంలో జబర్దస్త్ టీం కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఇప్పిస్తారు. ప్రముఖుల ప్రసంగాలు, లేజర్ షో, క్రాకర్స్ షో, ఫుడ్‌కోర్టులు, రాంలీలా తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. అతిథులు, కార్మికులు, వారి కుటుంబాలు, బల్దియావాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు నిర్మిస్తున్నారు. చిన్నపిల్లలు ఆడుకునేందుకు సైతం గేమ్స్ నిర్వహించాలని నిర్ణయించారు. కార్మిక కుటుంబాలతో పాటు, పారిశ్రామిక ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండటంతో ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.



క్రీడామైదానంలో వేడుకలకు ఏర్పాట్లు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

రాంలీలా సందర్భంగా శనివారం సాయంత్రం సింగరేణి స్టేడియంకు తరలివచ్చే ప్రజల కోసం అన్నిఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా ఫుడ్ కోర్టు స్టాల్‌ను గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. చిన్నపిల్లల ఆటలు, లేజర్‌షో, జబర్దస్త్‌టీంతో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి.



రాంలీలా కోసం ఏర్పాటు చేసిన కటౌట్

నోరూరించే వంటకాలు

దసరా పండుగ సందర్భంగా నిర్వహించే రాంలీలాకు హాజరయ్యే ప్రజలు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండేందుకు యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. సభికుల కోసం బారికేడ్లు నిర్మించి కుర్చీలు ఏర్పాటు చేస్తున్నాం. ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేసి సందర్శకులకు నోరూరించే వంటకాలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించాం. స్టాల్స్ ఏర్పాటు చేసుకునే వారు పర్సనల్ విభాగంలో శనివారం సంప్రదించాలి

– డి.లలిత్‌కుమార్, ఆర్జీ–1 జీఎం, సింగరేణి

రాజకీయాలకు అతీతంగా వేడుకలు

రాజకీయాలకు అతీతంగా దసరా వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నాం. మున్సిపల్, సింగరేణి, ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రాంలీలాను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించాం. జబర్దస్త్ కళాకారులతో ప్రదర్శన, లేజర్‌షో, ఫైర్‌షో, చెడుపై మంచి విజయానికి గుర్తుగా రాంలీలా ప్రదర్శన ఉంటుంది. ప్రతీఒక్కరు ఈకార్యక్రమానికి తమ కుటుంబంతో సహా హాజరై విజయవంతం చేయాలి. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తెలంగాణ పండుగలను ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నా.

– ఎంఎస్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన



శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో ఎంపీ వంశీకృష్ణ, కలెక్టర్ కోయ శ్రీహర్ష

- ప్రపంచ మేటి విద్యార్థులను తయారు చేసేలా యంగ్ ఇండియా విద్యాసంస్థలు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- అడవిసోమన్‌పల్లిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపన

మంథని: విద్యారంగానికి పెద్దపీట వేస్తూ, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యా బోధనకు ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి అడవిసోమన్‌పల్లి గ్రామంలో 25 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.300 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల పనులకు శుక్రవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. యంగ్ ఇండియా సమీకృత విద్యా సంస్థల కింద తొలివిడతలో ప్రభుత్వం 28 పాఠశాలలను మంజూరు చేసిందని తెలిపారు. ఈక్రమంలోనే మానేరు తీరంలోని అడవిసోమన్‌పల్లిలో విద్యాసంస్థ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో 2,500 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటారని, వీరికి 120 మంది టీచర్లను నియమిస్తామని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ద్వారా సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. త్వరలో రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో కూడా ఇలాంటి స్కూల్స్ మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వచ్చేనెలలో ప్రారంభిస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంతో మూలనపడిన డీఎస్సీ నియామక ప్రక్రియను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిచేసి 11వేలకు మందికిపైగా కొత్త ఉపాధ్యాయులను నియమించారని తెలిపారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేశామని, విద్యాశాఖను మెరుగుపరిచేందుకు కమిషన్ ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల్లో క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్ తదితర ఆటలు ఆడేందుకు అవసరమైన మైదానం, సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. వచ్చే సంవత్సరం దసరా నాటికి ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని, అన్నివర్గాల విద్యార్థులు ఒకేచోట అంతర్జాతీయస్థాయి విద్య అందుకునే అవకాశం కల్పిస్తామని మంత్రి వివరించారు. అనంతరం కాటమయ్య రక్షక కవచ కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతీరక్షక కవచ కిట్‌పై దాదాపు రూ.9వేల వరకు ఖర్చు చేసి గీత కార్మికులకు ఉచితంగా అందిస్తోందని చెప్పారు. చెట్టుపై కల్లు తీసేందుకు వెళ్లినప్పుడు ఈ కిట్ ఉపయోగించడం ద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమ, ఆర్ అండ్ బీ ఈఈ భావ్‌సింగ్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కవచ కిట్లను అందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సింగరేణి అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

రామగిరి(మంథని): సింగరేణి అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆర్జీ–3లోని ఓసీపీ–2లో జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తొలుత పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతితో పాటు 2024–25లో ఇప్పటివరకు సాధించిన బొగ్గు, విద్యుత్ ఉత్పత్తి, వ్యయం, లోటుపాట్లు, ఉద్యోగుల పనితీరుపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గతంలో ఎన్నడూ లేనివిధంగా 2023–24 ఆర్థిక సంవత్సరం లాభాల్లో వాటాను ఉద్యోగులకు పంచామని, కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల బోనస్ పంపిణీ చేశామని తెలిపారు. గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు వైవీ రావు, కోట రవీందర్‌రెడ్డి, ఎం.రామచంద్రారెడ్డి, అధికారులు రఘుపతి, రాజశేఖర్, రామరావు, నాగరాజు, సుదర్శనం, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



మినరల్ వాటర్ సరఫరా



జిల్లా వ్యవసాయ కార్యాలయంలో..

తాగునీటికి రూ.లక్షలు

కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలు ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులకు వరంగా మారాయి. యజమానులు పోటీపడుతూ మరీ మినరల్ వాటర్ సరఫరా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. సమావేశాలు, ఇతర అవసరాలు, సందర్శకులతో కలెక్టరేట్ నిత్యం రద్దీగా ఉంటుంది. వీరికి అవసరమైన నీటిని మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి తెప్పిస్తున్నారు. ఇందుకోసం రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. అయితే, కలెక్టరేట్‌లోనే ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వ ఖజానాపై ఇంత భారం పడదని కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



మైనింగ్ కార్యాలయంలో ..



మత్స్య శాఖ కార్యాలయంలో..



జిల్లా సహకార కార్యాలయంలో..

ముందుకు సాగని ‘సమీకృతం’

- యథాస్థానంలోనే కూరగాయల మార్కెట్?
- మూడేళ్లు గడిచినా అసంపూర్తిగానే పనులు



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అసంపూర్తిగా పనులు



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, అధికారులు (ఫైల్)

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణం మూడేళ్లుగా ముందుకు సాగడం లేదు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కేటాయించిన స్థలంలో ప్రారంభమైన పనులు ఇప్పటికీ అసంపూర్తిగానే మిగిలాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు అర్ధంతరంగా ఆపేశారు.

మార్కెట్‌పై నీలినీడలు..

జిల్లా కేంద్రంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో కూరగాయలతోపాటు మాంసం, చేపలు తదితర వస్తుసామగ్రి ఒకే ఆవరణలో విక్రయించుకునేలా సమీకృత మార్కెట్ నిర్మాణాలను చేపట్టింది. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

యథాస్థానంలోనే కూరగాయల మార్కెట్..

పట్టణంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ముందుకు సాగడం అనుమానంగానే ఉందంటున్నారు. ప్రస్తుతం జెండా కూడలిలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌ను అదేస్థానంలో ఆధునిక వసతులతో నిర్మిస్తేనే మేలని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన విజయరమణారావు.. కూరగాయల మార్కెట్‌ను అదేస్థానంలో ఆధునిక సౌకర్యాలతో నిర్మిస్తామని, వ్యవసాయ మార్కెట్‌లోకి తరలించబోమని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా విజయరమణారావు విజయం సాధించడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో జెండా కూడలిలో మార్కెట్ నిర్మాణం త్వరలోనే చేపట్టే అవకాశం ఉంటుందని అంటున్నారు.

మార్కెట్‌ను పరిశీలించిన కలెక్టర్ శ్రీహర్ష

స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని ఏవైనా అవసరాలకు వినియోగించుకోవచ్చనే విషయమై కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆరా తీశారు. కొద్దిరోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్‌తో కలిసి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను సందర్శించారు. ఈ భవనాన్ని ఇతర అవసరాలకోసం వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రూ.2కోట్లతో పనులు

పట్టణంలోని జెండా కూడలిలో ప్రసుతం ఉన్న కూరగాయల మార్కెట్ ఆవరణలోనే కొత్తగా అన్ని వసతులతో ప్రజలకు సౌకర్యంగా ఉండేలా కూరగాయల మార్కెట్‌ను నిర్మించనున్నాం. ఇందుకోసం రూ.2కోట్లతో పనులు మొదలు పెడతాం. వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఇతర అవసరాలకోసం వినియోగించే విషయాన్ని పరిశీలిస్తున్నాం.

– వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్, పెద్దపల్లి

జీడీకే–11 గని వరకు శాశ్వత రోడ్డు

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కార్మికుల సౌకర్యార్థం గోదావరిఖని నుంచి జీడీకే–11గని వరకు పర్మినెంట్ రోడ్డు నిర్మిస్తామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం జీడీకే–11గనిపై దేవీఅమ్మ వారి ఆలయంలో ఆర్జీ–1 జీఎం డి.లలిత్‌కుమార్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, కార్మికులకు సంస్థ సాధించిన లాభాల్లో 33శాతం వాటా ప్రకటించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. చరిత్రలోనే తొలిసారిగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ఇప్పించిన ఘనత తమ సర్కారుకే దక్కిందని అన్నారు. సింగరేణి కార్మికులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, సింగరేణి అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

గోదావరిఖని: జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ కోరారు. జీవీటీసీలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆసక్తి గల అభ్యర్థులకు ఈనెల 14న గోదావరిఖని నుంచి హైదరాబాద్ వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

'ఎంటీయూ-1273'తో లాభాలు



సిర్పపల్లిలో వరి పంటను చూపుతున్న ఆదర్శ రైతు వెంకట్ రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: ఆంధ్రప్రదేశ్ మాటేరు వ్యవసాయ పరిశోధన సంస్థ నుంచి ఎంటీయూ-1273 దొడ్డు రకం వరి విత్తనం విడుదలైనట్లు సిర్పపల్లి ఆదర్శ రైతు వంగల వెంకట్‌రెడ్డి తెలిపారు. తన వ్యవసాయ క్షేత్రంలో ఈ రకాన్ని సాగు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విత్తనం చలిని, అగ్గి తెగులు, మెడ విరుపును తట్టుకుంటుందని, కొంతవరకే చొడ ఉండి, ఎకరానికి యాజమాన్యాన్ని బట్టి యాసంగిలో 32-35 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. చీడపీడల సమస్యల తక్కువగా ఉంటుందని, ఇప్పటివరకు ఉన్న దొడ్డు రకం విత్తనాలతో పోల్చితే ఇది ఎక్కువ మేలు చేస్తుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు సంప్రదించాలన్నారు.

సాగు, పశుపోషణలో అతివలు

- 70 శాతం మందికి పైగా వ్యవసాయంలోనే..
- కుటుంబాలకు ఆర్థికంగా అండ
- ఆదర్శం.. వీర్నపల్లి మండల మహిళలు

వీర్నపల్లి(సిరిసిల్ల): పురుషులు ఉపాధి వెతుక్కుంటూ గల్ఫ్ దేశాలకు వెళ్తంటే.. మహిళలు కూరగాయలు పండిస్తూ, పశుపోషణ ద్వారా కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల అతివలు. మండలంలో 17 గ్రామాలుంటే 70 శాతా నికి పైగా మహిళలు వ్యవసాయ, అనుబంధ పనుల్లో నిమగ్నమవుతున్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ వారి భవితను బంగారుమయం చేస్తున్నారు. విత్తనాలు విత్తడం మొదలు పంటలు చేతికొచ్చే వరకు, పాడిపశువులకు పశుగ్రాసం సేకరణ నుంచి పాలు పితికి, పాల కేంద్రాలకు సరఫరా చేయడం వరకు అన్ని పనుల్లో వారే ఉంటున్నారు. ఆర్థిక వృద్ధి సాధిస్తూ ఆడపిల్లల పెళ్లిళ్లకు కీలక పాత్ర పోషిస్తున్నారు. గిరిజన మహిళల్లో దాదాపు అందరూ ఇలాంటి బాధ్యతలు చూస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



- ఈ ఫొటోలో కనిపిస్తున్న గిరిజన యువతి భూక్యాతండాకు చెందిన లకావత్ శిరీష. భర్త శ్రీనివాస్ సహాయంతో పాడిపరిశ్రమ నిర్వహిస్తోంది. వీరికి 7 ఆవులు, 4 గేదెలు ఉన్నాయి. ఎకరం పొలంలో జీవాల కోసం గడ్డిని పెంచుతున్నారు. పాల విక్రయం ద్వారా అన్ని ఖర్చులూ పోను నెలకు రూ.25 వేల వరకు ఆదాయం వస్తుంది.



- ఈ ఫొటోలో కనిపిస్తున్న గిరిజన మహిళా రైతు బావుసింగ్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని గోల్యానాయక్‌తండాకు చెందిన బట్టు మంగమ్మ. ఈమె భర్త హరిచంద్ విదేశాలకు వెళ్లి, అక్కడ పని దొరక్కపోవడంతో స్వగ్రామం తిరిగొచ్చాడు. తమకున్న ఎకరం భూమిలో రకరకాల కూరగాయలు సాగు చేసి, భర్త సహాయంతో వాటిని విక్రయిస్తోంది. నలుగురు పిల్లలను ఉన్నత చదువులు చదివించిచానని సంతోషంగా చెబుతోంది.

చికిత్స పొందుతూ హెచ్ఎం మృతి



సుహాసిని (ఫైల్)

వేములవాడ: వేములవాడ ఉర్దూ మీడియం హైస్కూల్ హెచ్ఎం సుహాసిని(55) చికిత్స పొందుతూ మృతిచెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ సాయినగర్‌కు చెందిన సుహాసిని-పవన్‌కుమార్ దంపతులిద్దరూ ఉపాధ్యాయులే. వీరికి ఒక కూతురు, కమారుడు ఉన్నారు. కూతురికి వివాహం చేశారు. పవన్‌కుమార్ కరోనా సెకండ్‌వేవ్ సమయంలో చనిపోయారు. సుహాసిని అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. కాగా, వీరి కుమారుడి పెళ్లి వచ్చే నెలలో చేసేందుకు నిశ్చయించారు. ఇంతలోనే సుహాసిని మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీనివాస్‌రావు, కృష్ణవేణి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అధ్యాపకులు పరామర్శించారు.

చెరువులో పడి వ్యక్తి..



విజేందర్ (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లికి చెందిన చిలుక విజేందర్(38) చెరువులో పడి మృతి చెందాడు. ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజేందర్ నీరుకుల్ల గ్రామానికి చెందిన తిరుపతిరావు వద్ద పాలేరుగా పని చేస్తున్నాడు. గత బుధవారం గేదెలను మేపేందుకు వెళ్లి, ఇంటికి రాలేదు. అతని భార్య రేణుక చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం తెల్లవారుజామున నీరుకుల్లకు చెందిన వ్యక్తి చేపలు పట్టేందుకు స్థానిక చెరువు వద్దకు వెళ్లగా అందులో మృతదేహం కనిపించింది. వెంటనే అతను పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించగా విజేందరేనని మృతుడి కుటుంబసభ్యులు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, విజేందర్‌కు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలు..



గంగమ్మ (ఫైల్)

మేడిపల్లి(జగిత్యాల): మేడిపల్లి మండలంలోని కమ్మరిపేటకు చెందిన గంగమ్మ(107) మృతిచెందింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గంగమ్మకు ముగ్గురు కూతుళ్లు. కొన్నేళ్ల క్రితం ఆమె భర్త చనిపోయాడు. వందేళ్లు దాటినా ఆమె ఆరోగ్యంగా బతికింది. ఎవరి సాయం కోరలేదు. ఎవరితోనూ గొడవ పడలేదు. రెండు, మూడు రోజులుగా జ్వరంతో ఇబ్బంది పడింది. గురువారం రాత్రి నిద్రలోనే చనిపోయింది. శుక్రవారం అంత్యక్రియలు జరుపగా గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా, మృతురాలికి కూతుళ్లు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్లు, మునిమనవలు, మునిమనవరాళ్లు తదితరులు 50 మందికి పైగా ఉన్నారు. అందరూ కలిసి గంగమ్మ 105వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అవ్వా.. నేను వస్తున్నా..

- బెంగటీలకు.. రంది పడకు..
- తల్లికి వెంకట్‌రెడ్డి ఫోన్‌కాల్

సాక్షి ఎఫెక్ట్



సత్తవ్వ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కొడుకును చూడాలన్న ఆ తల్లి తపనకు ఫలితం దక్కింది. తల్లిని చూసేందుకు వస్తున్నానంటూ ఫోన్ చేశాడు ఆ కొడుకు. వృద్ధురాలైన తల్లి తాళ్ల సత్తవ్వ పడుతున్న వేదనను 'సాక్షి'లో 'కొడుకా.. నీ జాడెక్కడ?' కథనాన్ని ప్రచురించింది. దీనిపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించి ఎల్లారెడ్డిపేట మండల అధికారులను ఆ వృద్ధురాలి ఇంటికి పంపించి ఆమె పరిస్థితిని తెలుసుకున్నారు. తల్లి పడుతున్న వేదన కొడుకు వెంకట్‌రెడ్డిని కదిలించింది. ఆరేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్న అతను శుక్రవారం తల్లికి ఫోన్ చేసి మాట్లాడాడు. 'అవ్వా.. నేను వస్తున్నా.. బాధపడకు.. బెంగటీలకు..' అంటూ భరోసాగా మాట్లాడాడు. 3 రోజుల్లో ఇంటికొస్తానని చెప్పాడు. కొడుకు ఫోన్ చేయడంతో ఆ తల్లి భావోద్వేగానికి గురైంది. కంటతడి పెట్టింది.

కామాక్షి ఆసుపత్రిలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మతో వైద్యురాలు బి.శ్రావణి

కరీంనగర్‌టౌన్: బతుకమ్మ సంబరాల్లో భాగంగా శుక్రవారం కరీంనగర్‌లోని కామాక్షి ఆసుపత్రిలో బతుకమ్మ సంబురాలను వైద్యులు ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి వైద్యురాలు బి.శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసం.. రూ.60 వేలు మాయం

కథలాపూర్(వేములవాడ): ఓ వ్యక్తి సైబర్ మోసానికి గురైన ఘటన కథలాపూర్ మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బాధితుడికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి, మీకు ఎల్ఐసీ పాలసీకి సంబంధించిన బోనస్ వచ్చిందని నమ్మించాడు. మీ అకౌంట్‌లో కొంత డబ్బు జమ అయిందని, మిగతా డబ్బులు కావాలంటే తాను చెప్పిన సూచనలు పాటించాలన్నాడు. చెప్పినట్లు చేయడంతో కొద్దిసేపటికి బాధితుడి ఫోన్ పే నుంచి రూ.60 వేలు మాయమయ్యాయి. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన అతను సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాడు. ఈ ఘటనపై సైబర్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం పేర్కొన్నారు.

రాజన్న దేవస్థానంలో పూర్ణాహుతి



వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి శుక్రవారం శ్రీరాజరాజేశ్వరీదేవి సిద్ధిదా అవతారంలో దర్శనమిచ్చారు. స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర శర్మ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, అమ్మవారికి పూజలు చేశారు. నాగిరెడ్డి మండపంలో పూర్ణాహుతి జరిపారు. రాజన్నను 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు.

మాతృభూమి కోసం పని చేసేది ఆర్ఎస్ఎస్



మాట్లాడుతున్న వక్తలు



హాజరైన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

- విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభమై 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంలో ఆర్ఎస్ఎస్ కరీంనగర్ శాఖ పథ సంచాలన్ (రూట్ మార్చ్) కార్యక్రమం, విజయదశమి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సెంట్ అల్ఫోన్స్ స్కూల్లో జరిగిన కార్యక్రమానికి విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మాతృభూమి సేవ కోసం ఉద్భవించిన సంస్థ ఆర్ఎస్ఎస్ అన్నారు. దేశం, స మాజం కోసం స్వయం సేవకుల స్వచ్ఛంద త్యాగం, తపస్సు, అంకితభావంతో ఆర్ఎస్ఎస్ వందేళ్ల ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగించిందన్నారు. నాగపూర్‌లో పదిమంది చిన్నపిల్లలతో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందన్నారు. కార్యక్రమంలో సంక్షేమ ట్రస్టు బల్మూరి కర్ణాకర్‌రావు, ఆర్ఎస్ఎస్ బాధ్యులు డాక్టర్ రమణాచారి, జిల్లా సంఘచాలక్ నిరంజనచారి, హన్మండ్ల శ్రీనివాస్‌రెడ్డి, స్వయం సేవకులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలు

జ్యోతినగర్(రామగుండం): రోడ్డు ప్రమాదంలో ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు ముజాహిద్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. రామగుండంకు చెందిన ముజాహిద్ ఎన్టీపీసీ ప్రాజెక్టు ఈఎస్‌పీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి పని చేసి, శుక్రవారం ఉదయం ఇంటికి వెళ్తున్నాడు. ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

అడవిశ్రీరాంపూర్ యువకుడికి..



గాయపడిన హరీశ్

ముత్తారం(మంథని): ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్‌కు చెందిన గాదర్ల హరీశ్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. హరీశ్ శుక్రవారం బైక్‌పై మచ్చుపేట వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా మైదంబండ ప్రధాన రోడ్డుపై వాహనం అదుపు తప్పడంతో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నరేశ్ సంఘటన స్థలానికి చేరుకొని, బాధితుడిని 108 వాహనంలో మంథని ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లికి పంపినట్లు స్థానికులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ నోటీసులు

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్‌లోని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ శుక్రవారం కలెక్టర్, సీపీలకు నోటీసులు జారీ చేసింది. తన డివిజన్ పట్ల మేయర్ సునీల్‌రావు వివక్ష ప్రదర్శిస్తున్నారని, దళితులైతే నిధులు పెట్టాలా అంటూ అవమానించారని కార్పొరేటర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, అట్రాసిటీ కేసు నమోదవడం విధితమే. గత నెల 26న ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కూ ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారంపై విచారణ జరిపి, వాస్తవాలు ఏమిటో, ఏం చర్యలు తీసుకున్నారో 30 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని సూచించింది.

వ్యభిచార నిర్వాహకుడి రిమాండ్

వేములవాడ/వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణ పరిధిలోని అయ్యప్పకాలనీ ఎదురుగా మెయిన్‌రోడ్డు పక్కన ఒక ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఒకరిని, ఓ మహిళను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం వివరాలు. నెల్లూరుకు చెందిన మల్లె రత్నయ్య వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఓ మహిళను వేములవాడకు రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో ఆ ఇంటిపై దాడి చేయగా.. కండోమ్ ప్యాకెట్లు, బెడ్‌షీట్లు, రూ.2 వేల నగదు సీజ్ చేశామన్నారు. సదరు మహిళను సఖీ సెంటర్‌కు తరలించి, నిర్వాహకుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జగిత్యాల క్రైం: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. జగిత్యాల పట్టణ ఎస్సై కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని అరవింద్‌నగర్‌లో ఉంటున్న తిరుమల్‌రావు గురువారం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామం సుల్తానాబాద్ వెళ్లాడు. శుక్రవారం ఉదయం తాళం పగులగొట్టి ఉండటంతో స్థానికులు ఆయనకు ఫోన్ చేసి, సమాచారం అందించగా ఇంటికి వచ్చాడు. బీరువాలోని 8 తులాల బంగారం, రూ.50 వేలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.